# నాకు నచ్చిన నా కథ

ఈ కథ నా స్వరచన. ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 7 ఆగస్టు '74లో ప్రచురింపబడి నాకు విశిష్ట ఖ్యాతిని ఆర్జించిపెట్టింది. ఆశయసాధనకి, నా అభిప్రాయాన్ని వ్యక్తీకరించడానికి ఈ కథ ఎంతో తోడ్పడింది. "భూత భవిష్యద్వర్తమానాలకు ఈ కథ వర్తిస్తుందని" నా భావన.

## మా కాలేజీ స్ట్రైక్

"స్ట్రైక్. అందరూ బయటికి వచ్చేయండి" అంటూ క్లాసులోకి వచ్చాడు మా క్లాసు రిప్రజెంటేటివ్.

"ఎందుకూ?" అన్నాను నేను.

"తరువాత చెపుతా కాని బయటికి పదండి. లెక్చరర్స్ వచ్చేస్తున్నారు" అంటూ తొందరచేయడంతో అంతా క్లాసుబయటికి వచ్చేశాము.

లెక్చరర్స్ క్లాసులకి రావడానికి మేడ దిగుతున్నారు మా క్లాసు రిప్రెజెంటేటివ్ మిగతా క్లాసులకు వెళ్ళి వాళ్ళ రిప్రజెంటేటివ్స్‌తో మాట్లాడి, వాళ్ళను కూడా బయటికి పంపేశాడు. లెక్చరర్స్ వచ్చి క్లాసులలో కూర్చుని ఆశ్చర్యంతో బయటికి చూస్తున్నారు.

ధరణీప్రగడ వెంకట శేషగిరిరావు

కాలేజీలో ఆర్ట్స్, సైన్స్ విద్యార్థులంతా చెట్లకింద గుమిగూడారు.

"ఏమిటీ విశేషం?" అని అడిగాను నా మిత్రున్నొకణ్ణి సమీపించి.

"ప్రిన్స్‌పాల్ మన క్లాసువాళ్ళను నలుగుర్ని సస్పెండ్ చేశారు" అన్నాడు నా మిత్రుడు.

"ఎందుకు?" అన్నాను.

"మంచినీళ్ళ కుండ పగులగొట్టారట" అన్నాడతడు.

"దానికే సస్పెండు చేయాలా?" అన్నాను నేను.

"నా కింతకంటె తెలియదు" అని అతడు వెళ్ళిపోయాడు. నేను మరి నలుగురిని అడిగి అసలు విషయం సేకరించగలిగాను.

వేసవికాలం కావడంవల్ల మా కాలేజీలో మార్నింగ్ క్లాసులే జరుగుతున్నాయి. మొదటి మూడు పీరియడ్సు ఏడున్నరనుండి పదిగంటలవరకు జరుగుతాయి. తరువాత పదిహేను నిమిషాలు ఇంటర్‌వెల్. మరల పన్నెండు వరకు రెండు పీరియడ్సు జరుగుతాయి.

ఆ రోజు ఇంటర్‌వెల్‌లో మా క్లాసు విద్యార్థులు నలుగురు పేపరు చదువుదామని లైబ్రరీ రీడింగ్‌రూముకి వెళ్ళారు. ఆ రూములో ఒక మూల ఒక కుండ, రెండు గ్లాసులు ఉన్నాయి. ఆ నలుగురు మంచినీళ్ళు తాగటానికని కుండదగ్గరకు వెళ్ళారట. మంచినీళ్ళు తాగడం అయింది. కుండ కూడా (ఏ విధంగానో నాకు తెలియదు) పగిలిందట. అది చూసిన ప్యూను ఒకడు ఆ దుర్వార్త ప్రిన్స్‌పాల్‌కు చేరవేశాడట.

ఆ వార్త విన్న ప్రిన్స్‌పాల్‌కు కోపంవచ్చి, వాళ్ళను పిలుచుకురమ్మని ప్యూన్ను పంపారట.

ప్రిన్సిపాల్ మిమ్మల్ని రమ్మంటున్నారని చెప్పేసరికి ఆ విద్యార్థులు ప్యూనుకొాక ఫోజుకొట్టి, మేము రాముపొమ్మని వచ్చేస్తుంటే ప్రిన్సిపాల్ వాళ్ళను ఆపి, మందలించి, కుండ కొని అక్కడ పెట్టమన్నారట.

మేము కావాలని ఎందుకు పగలగొడతాము? మేము కుండ కొనం. డబ్బులివ్వం, కాలేజీ గ్రాంట్సులోనుంచి కొనండి అన్నారట. అందుకు స్ట్రయిక్.

చెట్టుకింద గుమిగూడిన విద్యార్థులంతా కాలేజీ నాలుగుగోడలమధ్య ఏమి స్ట్రయిక్ చేస్తామని బయటికి వెళ్ళి, ప్రజలందరికీ తెలిసేలా చేయడానికి ట్రాఫిక్ ఆపడం మొదలుపెట్టారు.

ఇంతలో ఈ వార్త ఊళ్ళో కాలేజీలన్నింటికీ అందేసరికి, అన్ని కాలేజీల విద్యార్థులు మా కాలేజీ దగ్గరకు చేరారు. కొందరు ఊళ్ళో స్కూళ్ళను మూయించడానికి బయలుదేరారు.

చివరకు అన్ని కాలేజీల విద్యార్థులు కలిసి అందరికీ సంబంధించిన సమస్యలను కూడా కలిపి, ఒక వినతిపత్రం తయారుచేశారు. అందులో ఫీజులు తగ్గించాలి, కోర్సులు తగ్గించాలి వంటి సర్వవిద్యార్థుల అతి ముఖ్యమైన కోర్కెలను జోడించి, చివర ప్రిన్సిపాల్ అక్రమంగా ప్రవర్తించకూడదు, కాలేజీలో మంచినీటి కుండలు ఏర్పాటుచేయించాలి. సస్పెండు చేసిన విద్యార్థులపై సస్పెన్షన్ ఆర్డరు రద్దుచేయాలి అని వ్రాసి, ఒక కాపీ ప్రిన్సిపాల్‌కు, ఒక కాపీ కలెక్టరుకు సమర్పించారట.

మూడురోజులవరకు ఎటునుంచి సమాధానం రాకపోవడంతో సమ్మెను తీవ్రతరం చేయాలని నిశ్చయించారు. మరునాడు బంద్ నిర్వహించవలసిందిగా వ్యాపారస్థులకు, సమ్మె జయప్రదం గావించవలసిందిగా పుర ప్రముఖులకు విజ్ఞప్తి చేయడం జరిగింది.

షాపు అన్నీ మూసివేయడం జరిగింది. విద్యార్థుల సమస్యలు వాళ్ళకున్నాయి, వాళ్ళకు తమకు చేతనైన సాయం చేయడం తమ ధర్మమని పుర ప్రముఖులు భావించి, ట్రాఫిక్‌ను బంద్‌చేయడంలో తోడ్పడ్డారు. కేంద్ర కార్యాలయాలు తప్ప మిగిలిన కార్యాలయాలన్నీ పనిచేయడంలేదు. వాటిని కూడా మూయిద్దామని విద్యార్థులు ప్రయత్నించడంతో పోలీసులు లాఠీచార్జి ప్రారంభించారు. పోలీసులు ఎన్నాళ్ళకో అవకాశం లభించిందన్నట్లు మనిషీ, జంతువూ అనే భేదం చూపక వరసన బాదేస్తున్నారు. ఎక్కడ చూసినా అరుపులు, హీంకారాలు, ఓంకారాలు.

రోడ్డుమీద వెళ్ళే ప్రతివారినీ బాదడంతో ప్రజలలో సహనశక్తి నశించింది. వాళ్ళు తిరగబడడంతో కాల్పులు ప్రారంభమయ్యాయి

అప్పటికీ పరిస్థితి అదుపులో లేదని, ఆరోజు మూడుగంటలనుంచి కర్ఫ్యూ విధించారు. తరువాత మూడురోజులదాకా పొడిగించారు. మూడు రోజులూ కాల్పులు కూడా జరిగాయి. మరునాడు ఈ వార్త అన్ని పత్రికలలో వెలువడింది. రేడియోలో పదిహేను రౌండ్లు కాల్పులు జరిగాయని, కాని ఎవరూ చావలేదని వార్తలు వచ్చాయి.

మా పట్టణ విద్యార్థులకు జరుగుతున్న అన్యాయానికి రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు సమ్మె ప్రారంభించారు. ప్రజల చేతనైన సాయంతో సమ్మె ఉధృతం అయింది. రాష్ట్రప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేయడంతో సి.ఆర్.పి దళాలు, సైనిక పటాలాలు తరలివచ్చాయి.

మా రాష్ట్ర విద్యార్థులపై ప్రభుత్వ దమననీతికి మిగతా రాష్ట్ర విద్యార్థులకు, ప్రజలకు సానుభూతి జనించింది. దానితో మిగతా రాష్ట్రాలలోని విద్యార్థులు రంగంలోకి దిగారు. దానితో అక్కడి ప్రభుత్వాలు పరిస్థితిని అదుపులో పెట్టకపోతే, అక్కడ కూడా ఈ పరిస్థితే ఏర్పడుతుందని అంచనావేసి అధికంగా చర్య తీసుకోవడంతో అక్కడ కూడా అదే పరిస్థితి ఏర్పడింది.

దేశంలో అల్లకల్లోలం ప్రారంభమయింది. ఒక్కొక్క వీధికి ఒక్కొక్క నాయకుడు, వాడికొక సబ్‌నాయకుడుని పది వీధులకు ఒక వీరనాయకుడు, పట్టణానికొక అపరనాయకుడూ—ఈ విధంగా ఏర్పడి ఉద్యమం తీవ్రతరం చేయడంతో రైలుపట్టాలు, టెలిఫోన్‌తీగల సర్వనాశనం మొదలైంది, బస్సులు తగలబడుతున్నాయి. రైళ్ళు తిరగబడుతున్నాయి. కార్లు కాలిపోతున్నాయి.


దేశంలో పరిస్థితి అదుపులో పెట్టడం ప్రభుత్వానికి శక్యంకాలేదు. పార్లమెంటులో రభస ప్రారంభమయింది. దేశంలోని అల్లకల్లోలానికి ప్రతిపక్షాల చర్యయే కారణమని అధికారపక్షం తీవ్రంగా విమర్శించడంతో ప్రతిపక్షాలకు చిర్రెత్తింది. పక్షాలలో ముష్టియుద్ధాలు ప్రారంభమయ్యాయి. పార్లమెంటులోని ఫర్నిచర్ అంతా నాశనమయింది. వెంటనే ప్రధాని అమెరికా, రష్యా వెళ్ళి ఒప్పందాలు చేసుకుని, కౌగిలింతలపై సంతకాలు అయ్యాక స్వదేశం తిరిగిరావడం జరిగింది.

ఒప్పందంప్రకారం అమెరికా అయిదుకోట్ల డాలర్లు ఋణంగా యివ్వడానికి, అయిదు పర్సెంటు వడ్డీరేటుతో అయిదు ప్రణాళికల కాలంలో తీర్చడానికి నిర్ణయం జరిగింది.

రష్యా పదిహేను సూపర్‌జెట్ ప్లేన్లు, పది టాంకులు, పదివేల గన్‌లు, ఇతర మందుసామగ్రి ఇవ్వడానికి అంగీకరించింది.

రాష్ట్రాలకు ఆయుధసహాయం కేంద్రంనుంచి బాగా అందుతూంది. రేడియోలో ఎంత గురిచూసి కొట్టినా ఒక్కడూ చావడంలేదని వార్తలు వస్తున్నాయి. పత్రికలలో రోజుకు పదిహేనుమంది తక్కువకాకుండా చస్తున్నారని వారి విలేఖరులద్వారా అందిన వార్తలు ప్రచురింపబడుతున్నాయి.

అన్ని దేశాల ప్రభుత్వాలు ఇదేరీతిగా వ్యవహరిస్తున్నాయని ప్రపంచ ప్రజలలో అభిప్రాయం ఏర్పడింది. మన దేశంనుంచి చదువులకై వెళ్ళిన విద్యా




ర్థులు ఇతర దేశాలలో ఉద్యమాన్ని ప్రారంభించి, పోషించారు. దానితో అన్ని దేశాలలోను అల్లర్లు ప్రారంభమయ్యాయి. అన్ని దేశాల ప్రెసిడెంటులు, ప్రధానులు—బుర్రలు పట్టుకుని కూర్చున్నారు.

రష్యాలో అల్లకల్లోలానికి కారణం అమెరికా అయిఉంటుందని రష్యావాళ్ళు అనుమానపడడం, అమెరికాలోని కల్లోలానికి రష్యాయే కారణభూతమని అమెరికా అభిప్రాయపడడం జరిగింది. అమెరికా, రష్యాలు ఆయుధఉత్పత్తి ప్రారంభించి తమ మిత్ర దేశాలతో సమావేశాలు ప్రారంభించాయి.

ఇంతలో మనదేశంలో మా కాలేజీలో విద్యార్థులు సమ్మె విరమించడం మంచిదని, అనవసరంగా ఎకడమిక్ ఇయర్ పాడవుతుందని భావించి, సమ్మె విరమిస్తున్నట్లు మా ప్రిన్సిపాల్‌కు నోటీసు పంపారు ప్రిన్సిపాల్ అమితానందంతో మా కాలేజీ విద్యార్థులందరినీ ప్రశంసించారు.

మా కాలేజీ విద్యార్థులు సమ్మె విరమించినట్లు పత్రికలలోనూ, రేడియోలోనూ వార్తలు వచ్చాయి. అన్ని కాలేజీల విద్యార్థులూ క్లాసులకు అటెండ్ అవుతున్నారని, అటెండ్ అయ్యే విద్యార్థులసంఖ్య నూటపదిహేను పర్సెంటు ఉంటుందని రేడియోలో వార్తలలో చెప్పడం జరుగుతూంది. కాలేజీ ఆవరణలో పడుకోడానికి వచ్చినవారిని కూడా లెక్కించడం జరిగిఉంటుందని నే ననుకున్నాను. రాష్ట్రంలో అన్ని కాలేజీల విద్యార్థులు సమ్మె విరమించి క్లాసులకు అటెండవడం ప్రారంభించారు. పత్రికలలో వచ్చిన వార్తలు చూసి ఇతర రాష్ట్ర విద్యార్థులు సమ్మె విరమించారు. రెండు సంవత్సరాల్లో సి.ఆర్.పి.

దళాల్ని, సైన్యాన్ని ఉపసంహరించడం జరుగుతుందని అధికారవార్తను రేడియో ప్రకటించింది.

రష్యా, అమెరికాలు యుద్ధానికి దిగితే ప్రపంచయుద్ధం తప్పదని ఏ కూటమికీ చెందని దేశాలు నిర్ణయించి, యుద్ధపరిస్థితులు కల్పించవద్దని ఆ దేశాలకు విజ్ఞప్తి చేశాయి. చివరికి అంతర్జాతీయ సమావేశం ఏర్పాటుచేయబడింది. అమెరికా, రష్యాలు ఒక ఒప్పందానికి వచ్చాయి. ఆ ఒప్పందం ప్రకారం ఒక దేశం విషయాలలో మరొకదేశం జోక్యం కల్పించుకోకూడదని, అప్పటివరకు ఉత్పత్తిచేసిన ఆయుధాలు సముద్రంలో పారవేయాలనీ నిశ్చయించుకున్నాయి.

మేము సమ్మె విరమించిన పదిహేనురోజులకు కేంద్రప్రభుత్వం దేశంలోని కల్లోలానికి కారణం దర్యాప్తు చేయవలసిందని రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. రాష్ట్రప్రభుత్వం మా జిల్లా కలెక్టర్ని ఆదేశించగా, మా జిల్లా కలెక్టరు మా ప్రిన్సిపాల్‌కు నోటీసు పంపారు. మా ప్రిన్సిపాల్ లెక్చరర్స్‌ను సమావేశపరిచి, లెక్చరర్స్‌లో పొట్టు లేదని, వారు తమ విధ్యుక్తధర్మాన్ని నెరవేరుస్తున్నారని చెప్పి, విద్యార్థులలో అల్లరిచేసేవాళ్ళను మరునాడు తెలుపవలసిందిగా కోరారు.

విద్యార్థులందరూ వ్యక్తిగతంగా చాలా మంచివారని, ఎవరిమీద తమకు దురభిప్రాయం లేదని, అందరూ కలిసినప్పుడు ఏదో చిన్నతనంగా కొద్దిగా అల్లరిచేస్తారు తప్పితే మరేమీ లేదని లెక్చరర్స్ తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

చివరికి ఎవరిదీ తప్పు కాదని, కుండ చాలా పాతదవడంవల్ల రెండుగా విడిందని భావించబడింది. ప్రతి సంవత్సరం ఒక కొత్తకుండ ఏర్పాటుకి నిర్ణయం జరిగిందని. ప్రభుత్వం కాలేజీలకు ఎక్కువ గ్రాంటులు మంజూరు చేయడానికి అంగీకరించిందని, ప్రస్తుతం పగిలిన కుండ స్థానే కొత్తకుండను కాలేజీ ఫండ్స్‌నుండి ఏర్పాటుచేయడం జరుగుతుందని ప్రిన్సిపాల్ చెప్పడంతో మా కాలేజీ విద్యార్థులు అమితానందంతో మా కాలేజీ చెట్లన్నీ విరగగొట్టేశారు.

